# నిజాయితీ

శ్రీ పి. యస్. శాస్త్రి

"బాబూ వెళ్ళిన పని ఏమైందిరా?" సుందరమ్మగారు కొడుకు రామచంద్రాన్ని ప్రశ్నించారు.

"ఏమవుతుంది? నా మొహం అయింది. మళ్ళీ మామూలు తతంగమే! ఈయనగారు ఆ యింటర్వ్యూ చేసే ఆఫీసరుగారి కొడుక్కి కాలేజీలో సీటు కోసం రికమెండేషను చెయ్యలేదట! ఇప్పుడా కక్ష తీర్చుకున్నాడు! ఉద్యోగం లేదు పొమ్మన్నాడు!" రామచంద్రం అక్కసుగా అని లోపలికి వెళ్ళాడు.

కొడుకు యీ యింటర్వ్యూలోనైనా సెలెక్టయితే ఏ వుద్యోగంలో స్థిరపడతాడని ఆశించిన పరమేశ్వరరావుగారు తల్లీ కొడుకుల సంభాషణ విని నిట్టూర్చారు.

పెద్దకొడుకు రామం బియ్యే ఫస్టు క్లాసులో పాసయ్యాడు. తగినంత లోకజ్ఞానం వుంది. తప్పకుండా వాడికి వుద్యోగం దొరుకుతుందని తాము ఆశించడంలో తప్పులేదు! కాని తన ప్రవర్తన కొడుకు జీవితం మీద ప్రభావం చూపించడమే బాధగా వుందాయనకి.

పరమేశ్వరరావుగారు చాలా పెద్ద ఉద్యోగమే చేసి రిటైరయ్యారు. ఉద్యోగిగా నిప్పులాంటి మనిషని పేరు తెచ్చుకున్నారు. తన వాళ్ళు, ఆ శితులు అని పక్షపాతం చూపకుండా ఉద్యోగ జీవితం గడపటం ఆయనకే చెల్లింది. అందుకే ఎక్కువసార్లు పై అధికారుల ఆగ్రహానికి గురయ్యి, ఎవ్వరూ వెళ్ళడానికి సుముఖత చూపని ప్రదేశాలకు బదిలీ చేయబడి వుద్యోగాన్ని నిర్వహించారు. ప్రభుత్వమిచ్చిన జీతంలోనే పొదుపుగా వాడుకుని, రిటైరయ్యేనాటికి కొద్దిగా మాత్రమే డబ్బు నిలవవేసుకోగలిగారు. ప్రస్తుతం ఆ డబ్బే సంసారం గడపడానికి వుపయోగపడుతోంది. కొడుక్కి వుద్యోగం దొరక్కపోతే అది తొందరలోనే ఖర్చయిపోతుంది. ధరలు ఆకాశాన్ని అంటుతున్న యీ రోజుల్లో వచ్చే కొద్దిపాటి పెన్షన్ డబ్బులు యేమూలకి? పైగా వయసొచ్చిన కుమార్తె వివాహం ఒకటి చెయ్యాలి! అందుకనే కనిపించిన ప్రతి వుద్యోగ ప్రకటనకూ కొడుకుచేత అప్లికేషను పడేయిస్తున్నారు.

"భోజనానికి రండి. తరవాత తీరిగ్గా కూర్చుని ఆలోచించుకుందురుగాని!" సుందరమ్మగారు నవ్వుతూ అంది.

"చిన్నబ్బాయి యింకా రాలేదా? అమ్మాయి యెక్కడకు వెళ్ళింది?" పరమేశ్వరరావుగారు ప్రశ్నించారు.

"చిన్నాడు బాపిరెడ్డిగారింటికి వెళ్ళాడు. వాళ్ళబ్బాయి పుట్టిన రోజట. ఆలస్యంగా వస్తానన్నాడు. కమల లక్ష్మణరావుగారమ్మాయితో కలిసి సినిమాకి వెళ్ళింది. సుందరమ్మగారు జవాబిచ్చింది. ఓ లోచిస్తూ లేవాడు పరమేశ్వరరావుగారు.

చిన్నవాడు కుమార్ బియ్యస్సీ ఫైనల్ పరీక్షలకు వెళ్తాడు చదివింది వొట్టి బియ్యస్సీయే అయినా వాడి కోరికలు, లక్ష్యాలు చాలా పెద్దవి. ధనికుల విలాస జీవితాలు చూసి ఎప్పటికైనా తనూ వాళ్ళలా వుండగలగాలన్నది వాడి కోరిక. ఆ లక్ష్యం ఎప్పుడూ వాడి కళ్ళల్లో మెరుస్తూ వుంటుంది. చాలాసార్లు తను వాడి దృక్పథం మార్చటానికి ప్రయత్నం చేశాడు. కాని వుపయోగం కనపడలేదు.

కూతురు కమలదంతా అదో పద్ధతి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటుంది. ఆమె ఊహ లేమిటో ఎవ్వరికీ తెలియనివ్వదు. అప్పుడప్పుడామె కళ్ళల్లోంచి సంతోషపు మెరుపులు తొంగి చూస్తుంటాయి. కారణం అడిగినా చెప్పదామె. అప్పుడప్పుడు వచ్చే ఆ సంతోష తరంగాల వెనుక కారణం కనిపెట్టాలని ఊహ వచ్చినా తానుఎందుకో కారణాలడిగి ఆమెని విసిగించలేక పోయాడు.

భోజనం చేస్తున్న పరమేశ్వరరావుగారి మనస్సు తన పిల్లల గురించి ఆలోచిస్తోంది. బయట తనెంత కరుకు మనిషని పేరుతెచ్చుకున్నా పిల్లలదగ్గర కొచ్చేసరికి చాలా మెత్తగా వుండేవాడు. వాళ్ళమీద ప్రేమవల్ల వాళ్ళని పాడుచెయ్యను గదా అనుకుంటూ వుండేవాడు. కాని దేవుని దయవల్ల పిల్లలంతా చక్కగా చదువుకున్నారు.

"మీ భోజనం అయిపోయి పావుగంట అయింది. ఇంక లేవరా ఆక్కణ్ణుంచి?" సుందరమ్మగారు నవ్వుతూనే హెచ్చరించింది.

"లేస్తున్నా. లేస్తున్నా" తడబడుతూ బయటకు వెళ్ళి చెయ్యి కడుక్కున్నారు.

తరువాత మంచంమీద పడుకున్నా ఆయనని ఆలోచనలు వదల లేదు. చిన్న వుద్యోగంలో చేరిన తను నిజాయితీ, ప్రతిభల ఆధారంగా పెద్ద వుద్యోగంలోకొచ్చాడు. తన పిల్లలందరికీ నిజాయితీ పరమ పవిత్రమైనదనీ, ఆరాధించవలసిందనీ నూరిపోశాడు. తను నమ్మి ఆరాధించిన నిజాయితీ యీ కాలానికి పనికిరాదా? పోటీయుపడి పరుగులు తీస్తూ ఏలాగో, ఒకలాగ. ధనం, సుఖం సంపాదించుకోవాలను కునే నేటి సమాజంలో నిజాయితీ మనిషికి గుదిబండలా [illegible]

రవుతుందా? తను ఏనాడో సీటు కు రికమెండు చెయ్యలేదని తన కొడుకు ప్రతిభనీ, యోగ్యతల్నీ కాదనడం యే యుగ ధర్మం? రాత్రి అంతా పరమేశ్వరరావుగారికి సరిగ్గా నిద్రపట్టలేదు.

మర్నాడు పొద్దుటే బజారుకు కూరలకు బయలుదేరిన పరమేశ్వరరావుగార్ని కారాపి పలకరించాడు, ఆయన క్రింద పని చేసిన వెంకటరావు.

"బావున్నారా పరమేశ్వరరావుగారూ? మీ పెద్దబ్బాయి ఏం చేస్తున్నాడు? చిన్నవాడు ఏం చదువుతున్నాడు? మీ అమ్మాయి పెళ్ళి చేశారా లేదా?" అన్నాడు.

తనని కారులోకి రమ్మనకుండా, తానూ కారు దిగక ప్రశ్న లడుగుతున్న వెంకటరావు, కుసంస్కారానికి పరమేశ్వరరావు గారి ఒళ్ళు భగు మంది. అయినా అణచుకున్న కోపంతోటే, మర్యాదగా జవాబిచ్చాడు

"అదేమిటీ మీ వాణ్ని బియ్యేతోనే ఆపేశారా? చాలా 'ఇంటెలిజెంట్ చాప్' కాదండీ? అరెరె! అలా చేశారేమిటి? మా అబ్బాయిని ఫారెన్ పంపించా. అమ్మాయి యం. బి. ఫైనల్‌లో కొచ్చింది" అన్నాడు వెంకటరావు ముసిముసి నవ్వుల్తో.

పరమేశ్వ రావుగారికి వెంకటరావు ధోరణి బాగా చిరాకు కలిగించింది తన పద్ధతి, స్వామతా తెలుసుండే వెంకటరావు యిలా మాట్లాడటం తన నిజాయితీని, తనని. యెద్దేవా చేయటానికే అని ఆయన గ్రహించారు. ఒకటీ రెండుసార్లు వెంకటరావు మీద వచ్చిన పిటీషన్‌లు, కంప్లెయింట్లు గురించి అతన్ని హెచ్చరించి, వార్నింగిచ్చి నందుకే యీ బాధ అతనికి! ఇప్పుడు అవకాశం వచ్చింది కదా అని మురిసిపోతున్నాడు.

"ఎక్కడ ఎవరితో మీకేం అర్జంటు పనులున్నాయో! తొందరగా వెళ్ళి చూసుకోండి పాపం!" అంటూ జవాబు నాశించకుండా ముందుకి సాగిపోయారు పరమేశ్వరరావుగారు.

పరమేశ్వరరావుగారి మాటల్లో వ్యంగ్యం చురుక్కుమని తగిలింది వెంకటరావుకి. "హు! చింతచచ్చినా పులుపు చావలేదు" అని తనలో గొణుక్కున్నాడు వెంకటరావు.

"పోనివోయ్ కారును!" అంటూ డ్రైవరుమీద విసుక్కున్నాడు

బజార్లో తిరిగి తిరిగి యింటికి వచ్చిన పరమేశ్వరరావుగారికి తన పెద్ద కొడుకు రామచంద్రం ఏదో దీర్ఘాలోచనలో వుండటం కనిపించింది.

"ఏమిట్రోయ్ అంత గట్టిగా ఆలోచిస్తున్నావు!" తెచ్చి పెట్టుకున్న నవ్వుతో కొడుకు నడిగారాయన.

"ఈ యింట్లో నేను పుట్టకుండా వుంటే ఎంత బావుండేదా అని ఆలోచిస్తున్నాను!" విసురుగా వచ్చింది జవాబు.

కలుక్కుమన్న మనస్సుతో: "ఏం జరిగిందో చెప్పవోయ్ వెర్రి నాయనా!" అని బుజ్జగించారు కొడుకును ఆయన.

"ఇంతకుముందే నా క్లాస్‌మేటొకడు కారులో మన యింటి కొచ్చాడు. వాళ్ళ నాన్నగారి 'ఇన్‌ఫ్లుయన్స్'వల్ల వో పెద్ద కంపెనీలో బ్రాంచి మేనేజరు పోస్టు వచ్చింది వాడికి. నేనింకా వుద్యోగంలో చేరలేదని తెలిసి బాధపడ్డాడు. వాళ్ళ కంపెనీలో కొన్ని టెంపరరీ గుమాస్తా వుద్యోగాలున్నాయని, ముందు దాంట్లో చేరితే తరవాత వేరే మంచి వుద్యోగంలో చేరటానికి ప్రయత్నం చెయ్యొచ్చనీ చెప్పాడు. సరేనని అతనికూడా బయలుదేరి వెళ్ళి వాళ్ళ జనరల్ మేనేజరును కలుసుకున్నాను. క్వాలిఫికేషన్సు అన్నీ సరిగ్గానే వున్నాయన్నాడు. తన కంపెనీలోనే తరవాత వో పెద్ద పోస్టుకూడా యిస్తానన్నాడు. అన్నీ అయ్యాక నేను ఫలానావారి అబ్బాయిని అని తెలియగానే..." రామచంద్రం చెప్పటం ఆపేశాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఫరవాలేదు! ఏమన్నాడో చెప్పు బాబూ!" ఆందోళన చెందుతున్న మనస్సుతో అడిగారు పరమేశ్వరరావుగారు.

"మీ గురించి చాలా అసహ్యంగా మాట్లాడాడు వాళ్ళ కంపెనీ లైసెన్సుకు పెట్టిన దరఖాస్తు ఏమైందో కనుక్కోడానికి వెడితే మీరు అతన్ని గౌరవించకుండా గెటౌట్ అన్నారట కదా! అందుకని ఆ మాటే యిప్పుడు నా మీద ప్రయోగించాడు" అని కళ్ళు తుడుచుకున్నాడు రామచంద్రం.

ఆ కంపెనీ పేరు, ఆ జనరల్ మానేజరు పేరు వినుక్కున్న పరమేశ్వరరావుగారికి ఆనాటి సంఘటన వెంటనే గుర్తుకొచ్చింది

తన రూములోని సీటు దగ్గరకు వస్తూనే "మీది మీరు తీసుకుని, మాది మాకు పారేయండి సార్!" అని వెకిలిగా నవ్వుతూ జేబ్ బాగ్‌లో చెయ్యి పెట్టిన అతన్ని చూసి తను కోపం ఆపుకోలేకపోయాడు. ఒళ్ళెరుగని కోపంలో "గెటౌట్! బ్లడీఫూల్ అని!" పెద్దగా అరిచాడు. అది అయిదారేళ్ళ క్రిందటి సంఘటన. తన మీద కోపం తనకొడుకుమీద తీర్చుకున్నాడా ఆ మేనేజరు? మనుషులు వారి మధ్యవున్న సంబంధ బాంధవ్యాలు తప్ప ప్రతిభ, అర్హతల అవసరం లేదా నేటి వుద్యోగాలకి? తను వుద్యోగంలో చేరినప్పుడు ఆఫీసర్లంతా రాగద్వేషాల కతీతంగా వున్నట్లు కనిపించారే!

"ఊరుకో రామం. బాధ పడకు. నీ ప్రతిభకు తగిన

ఉద్యోగం ఎలాగొలాగైనా దొరుకుతుంది" ఓదార్చారాయన బరువెక్కిన మనస్సుతో.

తెల్లవారి యింత సేపయినా యింకా యింటికి రాని చిన్నకొడుకును గురించి ఆలోచిస్తూ వుండగానే చిన్నకొడుకు రావడం జరిగింది.

"ఏమోయ్ యింత ఆలస్యం అయ్యింది?" కుమార్‌ను మామూలుగానే ప్రశ్నించారు పరమేశ్వ రావుగారు.

"ఊఁ! అయింది!' అంటూ యింట్లోకి పోతున్నాడు కుమార్.

"రాత్రంతా ఎక్కడికెళ్ళావ్?" మళ్ళీ ప్రశ్నించారు.

"సుఖ సంతోషాలున్న స్వర్గంలోకి నాన్నగారూ!" అంటూ ని ఉరిమి ఎర్రని కళ్లలో తండ్రికేసి వోసారి చూసి, లోపలికి నడిచాడు కుమార్.

'అంటే యీ యింట్లో సుఖ సంతోషాలు లేవనేగా!" అనుకున్నారు పరమేశ్వరరావుగారు. సామాన్య జీవితం ఈనాటి పిల్లలకు నచ్చటం లేదా? కారణం ఏమిటి? మనిషి వున్నంతలో తిని, మనశ్శాంతితో జీవించటమే మానవ జీవితానికి సార్థకత అని ఇన్నాళ్ళూ తను పిల్లలందరికీ బోధించాడు. మనిషి అధిక సుఖాలు కోరుకొనటం సహజమే కాని తన పరిధికి మించిన ఆశలు కూడదు కదా? దీనివల్ల మనశ్శాంతి లేకపోవటం తప్ప ఉపయోగం వుండదు ఈ విషయం పిల్లలకెప్పుడర్థమవుతుంది? అసలు ఆకాశంపై అంచులు వెతికించుకోవాలన్న తన వాదన రైటేనా?

"ఏమిటో! చెప్పటం వరకే తప్ప మనం ఎవరి భావాల్ని, ఆచరణ లనీ మార్చలేం!' నిట్టూర్చారు పరమేశ్వరరావుగారు.

"ఏమండీ! ఈవేళ అమ్మాయిని చూడటానికి పెళ్ళివారొస్తున్నారుగా! మరిచే పోయారు!" భార్య సుందరమ్మ మందలింపుతో ప్రస్తుతంలోకొచ్చా రాయన.

"అవునవును! ఆ విషయమె మర్చిపోయాను! అమ్మాయినిలా పిలు!" అన్నారు.

లోపలికొచ్చిన కమలతో "అమ్మా కమలా! సాయంకాలం కాస యింట్లో వుండుతల్లీ!" అన్నారు. సంగతి తెలిసిన కమల "అలాగే లెండి!" అని తల ఎగరవేసింది; యిలా పెళ్ళి చూపులు ఆమెకోవటం యిది పదోసారి గనక.

పెళ్ళికొడుకు ఏ. జీ. ఆఫీసులో యు. డి. సి. గా చేస్తున్నాడు. అందచందాల కంటె డాబూ దర్పం హెచ్చు. తన చుట్టాలలో వొకరి ద్వారా వీళ్ల ఆ సంబంధం కై వెళ్ళి మాట్లాడివచ్చారు. ఆ చుట్టమే సాయంత్రం పెళ్ళివారిని తీసుకు వస్తున్నారు. "ఈ సంబంధమైనా కుదిరితే నా భారం తీరుతుంది" అనుకుని నిట్టూర్చారాయన

సాయంకాలం పెళ్ళి చూపుల తతంగం ముగిసింది. "మరి కట్నాల విషయంకూడా తేల్చేసుకుంటే..." నాన్నాడు మగ పెళ్ళివారి తరపు పెద్దమనిషి

"ఆ సంగతులు ముందు గదిలో మాట్లాడుకుందాం రండి' పరమేశ్వ రావుగారి చుట్టం ముందు గదిలోకి దారి తీశాడు.

"మంచి సాంప్రదాయం వున్న కుటుంబం. పిల్ల అందంగానే వుంది. పి యు సి. చదువుకుంది. ఏదో నామకార్థం వో అయిదు వేలు కట్నం యిస్తారు అన్నీ దాంట్లోనే సర్దుకోవాలి" అన్నాడు ఆయనే మగపెళ్ళివారితో.

"ఏమిటి? ముష్టి అయిదువేలా? మా సంగతి మీకు తెలీదా? కనీసం పదిహేను వేలు కట్నం అంటే నేవాని మేం అసలు పిల్లని చూడటానికే ఒప్పుకునేవాళ్ళం కాదు! రిటైరైన పెద్ద ఆఫీసరు గారి కూతురు కూడా, అందులోనూ పొక్కులే కదా! కనీసం యిరవై వేలయినా యిస్తారనే వుద్దేశంతో వచ్చాం. ఇదేమిటి యిలా అంటున్నారు? మాట్లాడకండి!" ఘర్జిస్తున్నాడు మగ పెళ్ళివారి తరపు పెద్ద!

"పరమేశ్వ రావుగారు ఉద్యోగంలో వున్నప్పుడు నిజాయితీ పరుడు. ఉద్యోగంద్వారా ఆస్తిపాస్తులు సంపాదించలేదు ఉన్న పెన్షను డబ్బులోంచే కూతురు పెళ్ళి చెయ్యాలి. పదివేలు అయినవేళ వొప్పుకోవాలని ప్రార్థిస్తున్నారు" పరమేశ్వ రావుగారి చుట్టం మగపెళ్ళివారి తరపు పెద్దమనిషిని పట్టుకుని బతిమాలాడు.

"చాల్చాలేవయ్యా చెప్పొచ్చావు! నాకు కావలసింది డబ్బు ఆయన నిజాయితీ పరుడైతే ఆ నిజాయితీకి మెచ్చి వచ్చేవాడికిచ్చి, చేసుకోమను ఆ కూతుర్ని! దమ్మిడీ తగ్గేది లేదు!" మగపెళ్ళివారి పెద్దమనిషి ధుమధుమలాడుతూ బయటకు నడిచాడు. మిగిలినవాళ్ళు ఆయన్ని అనుసరించారు.

పరమేశ్వ రావుగారు అవాక్కయి నిలబడ్డారు.

కమల, లోపలివాళ్ళకు యీ గొడవంతా వినిపిస్తూనేవుంది. కండువాలో ముఖం అద్దుకుంటూ లోపలికొచ్చిన తండ్రికేసి నిరసనగా చూసి తన గదిలోకి వెళ్ళిపోయింది కమల.

సాయంత్రమంతా మతిపోయినట్లు యింట్లో తిరుగుతున్నారు పరమేశ్వ రావుగారు. తన వుద్యోగ జీవితమంతా కళ్ళముందు తిరుగుతోంది. "నిప్పులాంటి పరమేశ్వరరావు" అని పేరు తెచ్చుకొన్నందుకు ఎంతో గర్వించాడు తను. వచ్చిన పేరును నిలబెట్టుకోడానికి శత విధాల ప్రయత్నించాడు అనుక్షణం అగ్నిలో నడకే అయింది తన వుద్యోగ జీవితమంతా! అప్పుడందరూ తనను మెచ్చుకున్నవాళ్ళే. పొగిడినవాళ్ళే! మరి యిప్పుడెందుకిలా అవుతోంది? అధికారం పోగానే నిజాయితీకి విలువ తగ్గుతుందా? నిజాయితీగా బతకటం, చేతకాకపోవటానికి పర్యాయపదంగా మారుతుందా? ఏమీ అర్థంకావటం లేదనుకుని తల పట్టుకున్నారు పరమేశ్వరరావుగారు.

రాత్రి ఎనిమిది గంటలవేళ కొడుకు రామచంద్రం బట్టలు పెట్టెలో సర్దుకుంటూ కనిపించాడు.

"ఎక్కడికయ్యా ప్రయాణమవుతున్నావ్?" మెల్లిగా పలకరించారు కొడుకును.

"మీ నిజాయితీ ప్రభావం నా జీవితంపై పడనంత దూరానికి!" తీక్షణంగా జవాబిచ్చాడు రామం.

"అంటే!" అన్నారు పరమేశ్వరరావుగారు. అంతకంటె ఏమనాలో తోచక!

"నన్ను క్షమించండి నాన్నగారూ! మీరు నిజాయితీతో అలా పట్టుకు ప్రేలాడకపోతే, నేనూ నా స్నేహితుల్లా ఫారెన్ వెళ్ళివుండేవాడని. పెద్ద చదువు చదివి పెద్ద ఉద్యోగం చేసుకునేవాడిని. మీ నిజాయితీ ధర్మమా అని ఆఖరికి అతి చిన్న ఉద్యోగంకూడా సంపాదించుకోలేక పోతున్నాను" మెల్లిగా వచ్చింది జవాబు!

"అయినా! నా అంతరాత్మకు సంతృప్తి పరచకుండా పనేదో చెయ్యటం ఆత్మ ద్రోహం కాదురా?" దీనంగా ప్రశ్నించారు పరమేశ్వరరావు.

"అంతరాత్మకు తృప్తి కలిగించటంకాదు నాన్నగారూ మీరు చేసింది! మీ అహంకారానికి తృప్తి కలిగించటం! నేను నిజాయితీపరుణ్ణి అనిపించుకోవాలన్న స్వార్థంతో మీరు మీ పిల్లల జీవితాల్ని నాశనం చేశారు. కటువుగా, నిజాయితీగా ప్రవర్తిస్తున్నానని చుట్టూ వున్న మనుషులకంటే ఎంతో అధికుణ్ణని వూహించుకుని, మీ చుట్టూ వున్న సంఘంతో, మనుషులతో సంబంధాలు త్రెంచుకున్నారు. ఎవ్వరి తోడు ఏ అక్కరా లేకుండా మొండిగా బ్రతకగలం అనుకునేవాళ్ళే నిజాయితీని పట్టుకు ప్రేలాడాలి నాన్నగారూ! మీ పిల్లల ఆశయాలు, కోర్కెలు చంపుకోమని శాసించే అధికారం మీకు లేదు. జన్మ నిచ్చినందుకు వాళ్ల కోర్కెల్ని తీర్చటం మీ విధి! చేతకాదు అనుకున్నప్పుడు జన్మ నివ్వటమే నేరం! మీ అహంకార సంతృప్తి కోసం మా బతుకుల్ని బుగ్గి చేశారు! మమ్మల్ని లోకంలోకి తీసుకు రాకుండా మీరు మీ అంతరాత్మ ప్రకారమే సంచరించి వుంటే ఎంతో సంతోషించి వుండేవాళ్లం! మీకేదో ఒక ఉద్యోగం దొరికింది కనుక నిజాయితీని పూజించారు! అసలు ఏ ఉద్యోగమూ దొరకని నే నేమని పూజించను? అందుకే మీ పేరూ, మీ నిజాయితీ తెలియని దూర దేశం ఎక్కడికైనా పోయి నా అదృష్టం పరీక్షించుకుందామనుకుంటున్నా! విజయం కలిగితే మిమ్మల్ని మళ్లీ కలుసుకుంటా!"

పరమేశ్వరరావుగారికి నమస్కరించి రామచంద్రం పెట్టెతో బయటకు వెళ్ళిపోయాడు.

ఆ హఠాత్సంఘటన నుండి, ఆ షాక్ ప్రవాహపు తాకిడి నుండి


మా ఖాతాదారులకు ఉగాది శుభాకాంక్షలు

*మీ సరుకులను మా సంరక్షణకు అప్పగించండి!*

**కమర్షియల్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్స్** (Regd)

***అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు:***
***107, తంబుచెట్టి వీధి,***
**మద్రాసు-1.**
ఫోన్ నం 24485 & 25748

CGT

*హెడ్డాఫీసు:*
*కొత్తపేట, పి బి నం 89,*
**గుంటూరు-1.**
ఫోన్ నం. 20560.

సిటీ బ్రాంచి: హంటర్‌రోడ్, 11 ఏ, ఎల్ఫిన్‌స్టన్ వీధి, ఫోన్: 88594.
బుకింగ్ ఆఫీసు: మద్రాసు–1. 304, తంబుచెట్టి వీధి, ఫోన్: 22648.
కోయంబత్తూర్: ఇండస్ట్రియల్ ఎస్టేట్.
వాల్టాక్స్ రోడ్: 173, రాసప్ప చెట్టి వీధి.
బొంబాయి: 20, ఓల్డ్ హనుమంతపుర వీధి, ఫోన్: 338837.

మరియు బ్రాంచిలు: *బెంగుళూరు, మైసూరు, ఎర్నాకుళం,*
*ఆంధ్రప్రదేశ్ అంతటా గలవు.*

తేరుకోటానికి పరమేశ్వరరావుగారికి చాలా సమయమే పట్టింది. తన కొడుకు చెప్పిందే నిజమా? అవసరమైనదానికన్న ఎక్కువ కరుకుగా వ్యవహరించాడాతను? అందరిలాగా తనూ వుండి వుంటే సంఘంలో తన బిడ్డల స్థానం పదిలమయ్యేదా? తన స్వార్థానికి పిల్లల జీవితాల్ని బలి చేశాడా? మారుతున్న కాలపు పోకడను తను గుర్తించలేక పోయాడా? నిజాయితీగా వుండటమే నేరమా?

"ఏమండీ చిన్నవాడీ వుత్తరం పంపించాడట" అన్న సుందరమ్మగారి మాటల్తో ప్రపంచంలో పడ్డాడు పరమేశ్వరరావుగారు. తెలియని భయంతో వొణుకుతున్న చేతుల్తో వుత్తరం విప్పారు.

"నాన్నగారూ! ఈ వుత్తరం మీ కందే సమయానికి నేను మద్రాసు వెళ్ళే రైల్లో వుంటాను. నా స్నేహితులు కొందరి చేత వో ఫిలిం కంపెనీ పెట్టిస్తున్నాను. వాళ్ళ డబ్బుతోటే నేను పెద్దవాణ్ణి అవటానికి ప్రయత్నిస్తాను! నేను తప్పకుండా నెగ్గుతాననే నా విశ్వాసం! పిచ్చి నాన్నగారూ! నిజాయితీ యీ కాలంలో ఎవరికీ అక్కర్లేదండీ మీ నిజాయితీ యీ లోకంలో మీకెంత సాయం చేసిందో చూశాకే యీ నిర్ణయాని కొచ్చాను. డబ్బును బట్టే నేటి సంఘంలో వ్యక్తుల గుణగణాలు ప్రకాశిస్తున్నాయి. డబ్బు లేనివాడి నిజాయితీ ఎందుకూ కొరగాదు! డబ్బు సంపాదనే ఆదర్శంగా పెట్టుకుని యీ లోకాన్ని జయించటానికి బయలుదేరిన నన్నాశీర్వదించరూ ?—

ఇట్లు,
మీ కుమారుడు,
కుమార్"

అనివుందా వుత్తరంలో.

"బాబూ! నా మనస్సాక్షిని, నేను నా జీవిత కాలంలో మీర లేకపోయాను నీ మనస్సాక్షి నీకేంచెబితే అలా చెయ్యడానికి హక్కుంది నీకు! ఏమని ఆశీర్వదించను నిన్ను ?" బాధగా కళ్ళు మూసుకున్నారాయన.

"ఏమండీ చిన్నవాడేం రాశాడండీ ?" ఖంగారుగా అడుగుతూ వచ్చింది సుందరమ్మగారు ఆవిడ చేతిలో మరో మహుత్తరం వుంది. "ఏంలేదు సుందరం! మద్రాసులో వాడికేదో వుద్యోగం దొరికేలా వుందిట, అందుకని మద్రాసు వెళ్ళాడు!" బలహీనంగా నవ్వారాయన.

"రాముడు వెళ్ళిపోయాడండీ! వీడూ వెళ్ళాడా? అమ్మాయి గదిలో యీ వుత్తరం వుంది. అదీ ఎక్కడికీ వెళ్ళిపోలేదుకదా ?" వచ్చే కన్నీళ్ళను తుడుచుకుంటూ ఆందోళనగా అడిగిందామె.

"చిట్టితల్లి నువ్వేమని వుపదేశించబోతున్నావ్ ?" అనుకుంటూ ఆ వుత్తరం విప్పారాయన.

"నాన్నగారూ! మీకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్నందుకు క్షమించండి నన్ను. నా క్లాస్‌మేటు సోమేశ్వరరావు నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకునేలా చేశాను. ఇలా రాసినందుకు ఆశ్చర్యపోకండి! ఈ రోజుల్లో కొంత మోసం, మరికొంత నటన ఉంటేతప్ప మనిషి సంఘంలో పైకొచ్చి సుఖంగా బ్రతకలేడు. సోమేశ్వరరావు తండ్రి నానా వ్యాపారాలూ చేసి లక్షలు సంపాదించాడు. ఈ రోజు అందరికీ లక్షలుకనిపిస్తాయేకాని వాటి సంపాదన వెనకవున్న నైచ్యం కనబడదు. ఆ లక్షలు, అవి యిచ్చే సాంఘికహోదా కోసమే నేను సోమేశ్వరరావును ప్రేమించినట్లు నటించాను. అనుకున్నది సాధించాను. వెర్రి నాన్నగారూ యీ రోజుల్లో నిజాయితీకి విలువలేదండీ! కనక మీరివ్వబోయే స్వల్ప కట్నానికి నాకు వివాహం అయ్యే అవకాశము లేదు! కనుకనే యిలా చేశాను. మీ నిజాయితీ నేను చేసిన మోసాన్ని అసహ్యించుకున్నా, మీ పితృ హృదయం, నన్ను క్షమిస్తుందనే ఆశిస్తాను. మీ ఆశీర్వచనంకోసం ఎదురుచూసే—

మీ కుమార్తె
కమల."

"ఏమండీ కమల యేం రాసిందండీ ? ఎక్కడికేనా వెళ్ళిందా? ఏమ్పడొస్తుంది ?" ఆతృతతో అడిగింది సుందరమ్మగారు.

"కమల తన పెళ్ళి తనే చేసుకుంది సుందరం! ఈ ముసలి తండ్రి అసహాయత గుర్తించింది"

కన్నీళ్ళు బయటకుబికాయి ఆయనకు!

(అత్యవసర పరిస్థితి ప్రకటనకు ముందున్న పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని రాయబడింది కథ. —రచయిత.)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.